

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## అమ్మ నవ్వు

**నారాయణ** అంత్యక్రియలు ముగిసాయి, కొడుకులు, కూతురు, వారి భాగస్వాములు, బంధువులు ఎక్కడా ఎలాంటి అవాంతరం లేకుండా నిర్విఘ్నంగా, సక్రమంగా అన్నీ పూర్తిచేసారు.

పది రోజులు దాటినా వాసంతి భర్తని కోల్పోయిన దుఃఖంలోంచి బయటకి రాలేకపోయింది. ఆమె గదిలోంచి బయటికి రాకుండా, వెలుగు చూడకుండా చీకట్లో ఆవేదనతో కుములుతూండిపోయింది. కూతురు ఎంత బతిమాలినా ఆవిడ బయటకి రాలేదు.

నారాయణ, వాసంతిలది అన్యోన్య దాంపత్యమని చెప్పాలి. చిన్నప్పుడే తల్లితండ్రులని కోల్పోయిన వాసంతికి పదిహేనో ఏట మేనమామ, నారాయణతో పెళ్ళి చేసాడు – ఏభై ఐదేళ్ళ క్రితం. ఊహ తెలిసినప్పటినించి పరాయిళ్ళలో ప్రేమకి నోచుకోకుండా పెరిగిన వాసంతికి ఆ పెళ్ళితో నా అనే ఒక మనిషి, నాది అనే ఒక ఇల్లు ఏర్పడడంతో ఆ అదృష్టాన్ని ఎప్పటికీ వదులుకోకూడదనుకుంది. నారాయణ కూడా నెమ్మదస్థుడు. తల్లితండ్రులు లేనివాడు. ప్రైవేట్ కంపెనీలో చిన్న ఉద్యోగం చేసేవాడు. ఈ అనాధలిద్దరూ తమకి లభించిన ఈ కొత్త బంధానికి అమితమైన గౌరవాన్నిచ్చి, పరస్పరప్రేమతో మెలిగేవారు.

పిల్లలు పుడితే ఆర్ధికంగా ఇబ్బందులు పడతామనే ఆలోచనతో ఇద్దరూ ప్రైవేట్‌గా డిగ్రీ చదివారు. పెద్దకొడుకు వసంత్ కడుపున పడేనాటికి నారాయణకి గవర్నమెంట్ ఆఫీసులో గుమాస్తా ఉద్యోగం వచ్చింది. తర్వాత ఉద్యోగంలో

ప్రమోషన్స్ హేమంత్, కార్తీకల పుట్టుక, వారి జీవిత రథం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగింది. పిల్లలు చదువుకుని నచ్చినవాళ్ళని చేసుకుని బెంగుళూర్‌లో ఒకరు, నొయిడాలో ఒకరు స్థిరపడితే, కూతురు హైద్రాబాద్‌లో ఉంటుంది.

సెక్షనాఫీసర్‌గా రిటైరైన నారాయణ తెనాలిలోనే స్వంత ఇంట్లో వాసంతితో మిగిలిపోయాడు. పిల్లలు తమ దగ్గరకి రమ్మన్నా వాళ్ళు ఒప్పుకోలేదు.

రెండేళ్ళ క్రితం ఓరోజు వాసంతి లేచి చూసేసరికి భర్త స్పృహలోలేదు. ఇరుగు పొరుగు సాయంతో హాస్పిటల్‌కి తీసుకెళ్ళింది. పరీక్షల అనంతరం ఆయనకి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందని, అర్ధరాత్రి రావడంతో సరైన సమయంలో గమనించక గోల్డెన్ అవర్ కాలం దాటిపోయి చికిత్సకి లేటైందని తేల్చారు. నారాయణ మంచానికి పరిమితమయ్యాడు. అతని కుడిభాగానికి పక్షవాతం వచ్చింది. మాటలో స్పష్టతపోయింది. మెదడు మొద్దబారింది. అప్పుడప్పుడూ చురుగ్గా ఉన్నప్పుడు తన పరిస్థితికి బాధపడతాడు. మిగిలిన సమయాల్లో స్థబ్దుగా పడుకుంటాడు.

పిల్లలంతా వచ్చారు. వాళ్ళకేం చేయాలో తోచలేదు. తమ ఆఫీస్ వాళ్ళు ఇన్సూరెన్స్ ఇస్తారని, బిల్స్ అన్నీ జాగ్రత్త చేయమని వసంత్ చెప్పాడు. ఆ సదుపాయం స్టేట్ గవర్నమెంట్ కూడా ఇస్తుందని వాసంతి చెప్పింది.

నెలరోజుల తర్వాత ఇంటికి పంపారు. ఫిజియోథెరపీకి నారాయణ శరీరం సహకరించకపోయినా పట్టుదలగా ప్రయత్నించసాగాడు. హాస్పిటల్‌లో ఉన్నప్పుడే మాట వచ్చింది. చెయ్యి స్వల్పంగా కదులుతుంది కాని పైకి లేకలేకపోయాడు.

కాళ్ళకి స్పర్శజ్ఞానం పోయింది.

ఎవరున్నా ఏమీ చేయలేని పరిస్థితి కాబట్టి పిల్లలు వెళ్ళిపోయినా వసంత్ రెండు వారాలకోసారి, హేమంత్ నెలకోసారి వచ్చి తండ్రిని చూసి వెళ్ళసాగారు. కార్తీక అప్పుడప్పుడూ వచ్చి తల్లికి సాయంగా ఉండేది.

మొత్తానికి రెండేళ్ళ చెర వదిలించుకుని నారాయణ స్వర్గస్థుడయ్యాడు.

వచ్చిన కొద్దిపాటి బంధుమిత్రులు వెళ్ళిపోయారు. ఇంట్లో పిల్లలు మాత్రమే మిగిలారు. వసంత్ భార్య మిగిలిపోయిన పదార్థాలని చిన్న గిన్నెల్లోకి మార్చి పెద్ద పాత్రలు కడగడానికి వేస్తోంది. హేమంత్ భార్య పనిమనిషితో దగ్గరుండి ఇల్లు శుభ్రం చేయిస్తోంది. షామియానాల వాళ్ళు వచ్చి డబ్బు తీసుకుని విప్పుకుపోయారు.

అన్నయ్యలతో హాల్లో కూర్చున్న కార్తీక హఠాత్తుగా అడిగింది.

"ఇకనించి అమ్మకి తోడెవరుంటార్రా?"

అక్కడ ఓ క్షణం నిశ్శబ్దం

"నా దగ్గరుంటుంది."

"నాతో తీసుకువెళ్తాను."

వసంత్, హేమంత్ ఒకేసారి చెప్పారు.

"మా ఇంట్లో ఉంటుంది. తెలుగు మాట్లాడే ఊరు కాబట్టి అమ్మకి హైద్రాబాద్ బెటరేమో" కార్తీక ఆలోచనగా చెప్పింది.

"అసలు అమ్మ ఆ దుఃఖంలోంచి బయటకి రావాలిగా" వసంత్ భారంగా అన్నాడు.

"అవును. అమ్మానాన్నా ఎంత కలిసి మెలిసి ఉండేవారో. నిజంగా అమ్మకి ఈ వయసులో పెద్దలోటు" హేమంత్ కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

"అమ్మనే అడుగుదాం. నేను వెళ్ళి తీసుకొస్తాను" కార్తీక తల్లిగదిలోకి వచ్చి, ఆమెని నెమ్మదిగా లేవదీసి, బయటికి తీసుకొచ్చింది.

హేమంత్ తల్లివైపు కుర్చీని జరిపి అభిమానంగా చెప్పాడు.

"కూర్చో అమ్మా. ఈ పదిరోజుల్లో ఎంత సన్నబడిపోయావో."

వాసంతి మౌనంగా కూర్చుంది.

కార్తీక తల్లి వెనక నిలబడి భుజాలమీద చేతులు వేసి ప్రేమగా అడిగింది.

"అమ్మా నీకు తోడు లేరని నువ్వు వంటరిగా ఉండలేవని మేము నిన్ను మా ఇళ్ళకి తీసుకెళ్ళాలనుకుంటున్నాం. చెప్పు. నువ్వు ముందు ఎవరింటికి వెళ్తావు? నా దగ్గరకే కదా?"

వాసంతి తలెత్తి తన ముగ్గురు పిల్లలవంక చూసింది. తర్వాత పెద్దగా నవ్వింది. ఆ నవ్వుకి వంటింట్లోని పెద్ద కోడలు, వాకిట్లో ఉన్న చిన్నకోడలు, గదిలో పడుకుని ఫోన్ చూసుకుంటున్న అల్లుడు ఉలిక్కిపడి పరుగెత్తుకొచ్చారు.

దాదాపు అరనిమిషం సేపు నవ్విన వాసంతి, బిక్కమొహంతో తనవంక చూస్తున్న పిల్లల్ని ప్రేమగా చూస్తూ చెప్పింది.

"ఇప్పుడు కొత్తగా నేను వంటరినేమిటి? రెండేళ్ళనాడే వంటరినయ్యాను. ఇప్పటిదాకా వంటరిగానే ఉన్నాను. కొత్తగా వచ్చే వంటరితనం ఏమీలేదు. నేను ఇక్కడే ఉంటా. మీకు వీలైనప్పుడు వచ్చి చూసి వెళ్తూండండి చాలు."

"అదేం మాటమ్మా?" కార్తీక నిర్ఘాంతపోయి అడిగింది.

"నాన్నకి అలా అయ్యాక ఆయన మంచానికే పరిమితమయ్యారు కదా? అలాంటి మనిషి నాకేం తోడమ్మా చెప్పు? ఎంత ప్రయత్నించినా ఈ ఊళ్ళో ఇంట్లో ఉండి పేషెంట్‌ని చూసుకునే మేల్‌నర్స్ దొరకలేదు. నాన్న పనులన్నీ నేనే చేసాను – షేవింగ్‌తో సహా. మందులైపోయాయని అర్ధరాత్రో, అపరాత్రో చూసుకుంటేనో, పగలు చూసుకుంటేనో, మందుల షాప్‌కి నేనే వెళ్ళి మందులు తెచ్చాను. కూరగాయలు, వెచ్చాలు కూడా నేనే తెచ్చుకున్నా."

ఆవిడ ఓ నిమిషం ఆగి కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది.

"నాన్నతో చెప్పేదాన్ని, బజారుకి వెళ్తున్నా, గంటలో వస్తా" అని. తలని కూడా తిప్పలేని ఆయన కళ్ళు తిప్పేవారు 'సరే' అన్నట్లుగా. నేను వచ్చేదాకా అలాగే పైకి చూస్తూ పడుకునేవారు. అప్పుడు ఏ దొంగో దూరినా ఆయన ఏమీ చేయలేరు. అది వంటరి తనం కాదా? మీరు అప్పుడప్పుడూ వచ్చి మమ్మల్ని చూసిపోయేవారు. ఇక్కడే పుట్టిపెరిగినా మీకు ఈ ఇల్లు కొత్త. ఏమీ చేసేవారు కాదు. నాన్నకి శరీరం పేరలైజ్ అయింది. కాని మెదడు పాక్షికంగా బానేవుంది. మీరు ఆయన దగ్గర కూర్చుని కనీసం అరగంట కబుర్లు చెప్పినా ఆయన వినేవారు. కానీ మీరు రాగానే ఓసారి ఆ గదిలోకి వెళ్ళి 'నాన్నా ఎలా ఉన్నావు?' అని అడిగి బయటకి వచ్చేసేవారు. వెళ్ళేప్పుడు 'వెళ్ళొస్తా నాన్నా' అని చెప్పేవారు. కొత్తల్లో నేను మీ అందరికీ చెప్పాను. 'నాన్న దగ్గర ఒక్క అరగంట కూర్చోండిరా' అని. కాని మీరు నా మాటలు లక్ష్య పెట్టలేదు. నాతో వంటింట్లో ఉండేవారు. లేదా బయటకి వెళ్ళి ఫ్రెండ్స్‌తో కబుర్లు చెప్పి వచ్చేవారు. ఫోన్లలో 'మా నాన్నని చూడడానికి తెనాలి వచ్చాను' అని చెప్పేవాళ్ళు. నా పనులు ఏవీ మీరు అందుకుని చేయలేదు. నిర్లిప్తంగా ఉండిపోయేవారు. లేదా 'ఇంకా మనిషి దొరకలేదా అమ్మా' అని విసుక్కునేవారు. డెబ్బై ఏళ్ళ నేను మొండిగా, ధైర్యంగా ఆయన్ని చూసుకున్నాను. ఇంటా, బయటా పనులన్నీ నేను చేసుకున్నాను. తీరిక చిక్కినప్పుడు ఆయన పక్కన కూర్చుని కబుర్లు చెప్పాను. పుస్తకాలు చదివి వినిపించాను. రెండేళ్ళతో రుణం తీరిపోయింది. నాకిప్పుడు చాలా పని తప్పింది. బ్రషింగ్, షేవింగ్, టవల్ బాత్, డైపర్స్ మార్చడం, వేయడం, అన్నం తినిపించడం – ఇంకా చాలా పనులు చేయక్కర్లేదు నేను. మందుల షాప్‌కి, డాక్టర్ దగ్గరకి వెళ్ళక్కర్లేదు. ఇంక నాకు విశ్రాంతేగా? నేను ఇక్కడే విశ్రాంతిగా ఉంటాను. నాకు చేతకానప్పుడు మీ దగ్గరకేగా వచ్చేది? ప్రస్తుతం వద్దులే"

పిల్లల మొహాలు చూసి హృదయం ద్రవించిన ఆ తల్లి చెప్పింది.

"మీరు చెడ్డవాళ్ళు అనడంలేదు. మీకు తట్టలేదు అంతే. మీకు మేమంటే ఎంతో ప్రేమని మాకు తెలుసు."

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments